# వేడుకకు వేళాయే..!

## 2023కు వీడ్కోలు పలికి 2024కు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

- ఆటపాటలతో పాటు సంబురాలకు సిద్ధమవుతున్న ప్రజలు
- బేకరీలు, రెస్టారెంట్లు, హోటళ్లు, స్వీటు షాపుల్లో ప్రత్యేక ఆఫర్లు
- అబ్బురపరిచే రంగవల్లుల కోసం విరివిగా రంగుల కొనుగోళ్లు

**2023కు వీడ్కోలు పలికి న్యూఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు. వ్యాపారస్తులు సైతం ప్రజలకు ఆకర్షణీయమైన ఆఫర్లతో సంబురాలకు కావల్సిన కేక్‌లు, స్వీట్లు అందిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో సైతం ఆఫర్లు ఇవ్వగా ఆదివారం అంతటా సందడి కనిపించనుంది.**

– రామగిరి, డిసెంబర్ 30

2023 సంవత్సరానికి బాయ్ చెప్పి 2024కి స్వాగతం పలుకుతూ చర్చిల్లో, పలు వ్యాపార సంస్థల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు జిగేల్ జిగేల్ మననున్నాయి. నల్లగొండ గడియారం సెంటర్‌లోని సెయింటినరీ సపోషన తెలుగు బాపిస్టు చర్చితో పాటు దేవరకొండ రోడ్డులోని మరియగుట్ట, మరియా మాత చర్చితో పాటు అన్ని ప్రాంతాల చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేయడంతో ఆ ప్రాంతాలు వేడుకలతో సంబురంగా కనిపించాయి.



నల్లగొండ పట్టణంలో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

### భలే ఆఫర్లు...

న్యూ ఇయర్‌ను పురస్కరించుకుని వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లు ఏర్పాటు చేస్తున్నారు. చికెన్, మటన్, ఫిష్, వెజ్ బిర్యానీ జంబో, ఫ్యామిలీ ప్యాక్‌లతో ఆపర్లుగా ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. మరోవైపు కేకులకు, స్వీట్లకు గిరాకీ పెరిగింది. ముఖ్యంగా యువత సంబురాల్లో ఎక్కువగా పాల్గొననున్నారు.



నల్లగొండ పట్టణంలో కేక్‌లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

### అబ్బురపర్చనున్న రంగవల్లులు

పలు కాలనీలు, అపార్టుమెంట్లతో పాటు ఇళ్ల ముంగిళ్లలో వేసే రంగవల్లులు అబ్బురపర్చనున్నాయి. మహిళలు శనివారం సాయంత్రమే వీటికి కావల్సిన రంగులను కొనుగోలు చేశారు. స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి న్యూఇయర్ వేడుకలు జరుపుకొనేందుకు పలువురు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ముస్తాబైన ఆలయాలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పలు దేవాలయాలను ముస్తాబు చేస్తున్నారు. విద్యుత్ కాంతుల్లో ఆలయాలు మెరిసిపోతున్నాయి. నల్లగొండలోని రామగిరిలో గల సీతారామచంద్ర స్వామి, షిర్డీ సాయి ఆలయాలతో పాటు అన్ని ప్రాంతాల్లోని ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. అదే విధంగా చర్చిల్లో సైతం ఘనంగా ఏర్పాట్లు చేయగా ఆదివారం అర్ధరాత్రే వీటిల్లో సంబురాలు నిర్వహించనున్నారు.

# హద్దు దాటితే చర్యలు

**సూచనలు పాటించాలని**

**పోలీస్ శాఖ ఆదేశాలు జారీ**

**నిబంధనలు అతిక్రమిస్తే**

**చర్యలు తప్పవని హెచ్చరిక**



భువనగిరి అర్బన్, డిసెంబర్ 30 : న్యూఇయర్ వేడుకలు ప్రజలు ప్రశాంతంగా జరుపుకొనేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం భద్రత కట్టుదిట్టం చేసింది. వేడుకల బందోబస్తుకు గాను జిల్లాలో ఏడు క్యూరెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేసింది. పట్టణంలోని ప్రధాన జంక్షన్ల వద్ద వెహికిల్ చెకింగ్, డ్రంకెన్ డ్రైవ్ చెకింగ్‌లు చేస్తారు. ప్రతి క్యూఆర్‌టీ టీమ్‌ల వద్ద వీడియో కెమెరాలను కలిగి ఉండి, ఎలాంటి సంఘటనలు జరిగిన రికార్డు చేస్తారు. ఈ టీమ్‌లు జిల్లాలోని పబ్స్, రిసార్ట్స్, హోటల్, ఫామ్ హౌస్‌ల వద్ద తనిఖీలు చేస్తారు. ప్రజలు పోలీస్ సిబ్బందికి సహకరించి తగు జాగ్రత్తలు పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని సూచిస్తున్నారు.

### క్యాబ్స్, టాక్సీ, ఆటో డ్రైవర్లు

క్యాబ్స్, టాక్సీ, ఆటో డ్రైవర్లు కచ్చితంగా యూనిఫామ్ ధరించాలి. అదేవిధంగా బండికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు వెంట ఉంచుకోవాలి. క్యాబ్ డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ రైడ్ నిరాకరించకూడదు. ఇది మోటారు వాహనాల చట్టం, 1988లోని సెక్షన్ 178 ప్రకారం ఉల్లంఘన, ఉల్లంఘించిన వారికి రూ.500 జరిమాన విధించబడుతుంది. ఎవరైనా ఇలాంటి ఉల్లంఘనకు పాల్పడితే వాహనం నంబర్, సమయం, ప్రదేశం మొదలైన వివరాలతో వాట్సాప్ 8712662111 కు ఫిర్యాదు చేయాలి. ప్రజలతో అసభ్యకరంగా ప్రవర్తించకూడదు. ఎలాంటి అదనపు ఛార్జీలు డిమాండ్ చేసిన వారిపై చర్యలు తప్పవు.

### ప్రజలు పాటించాల్సిన సూచనలు...

ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంప్, ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవు. జిల్లా పరిధిలోని అన్ని రహదారులపై రాత్రి 8గంటల నుంచి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తారు. సరైన పత్రాలు లేని పక్షంలో వాహనాలను తాత్కాలికంగా పోలీస్ వారు వారి కస్టడీలోకి తీసుకుంటారు. చట్ట ప్రకారం పబ్లిక్ రోడ్లపై పోలీసుల సూచనలు పాటించడంతో పాటు వాహన పత్రాలను చూపించడం వాహన డ్రైవర్ల విధి. పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. చెల్లుబాటయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా లేదా మైనర్ డ్రైవింగ్ చేస్తే వాహనాన్ని నిర్బంధంలోకి తీసుకోబడును. వాహన యజమాని, డ్రైవర్ ఇద్దరూ న్యాయస్థానంలో ప్రాసిక్యూట్ చేయబడతారు. వాహనాల్లో అధిక డెసిబెల్ సౌండ్, మ్యూజిక్ సిస్టమ్లను ఉపయోగించడం నిషేధించబడింది. ఒక వేళ అలా చేస్తే తదుపరి చర్యల కోసం వాహనాలు నిర్బందించబడి ఆర్టీఓ అధికారికి పంపబడను. నంబరు ప్లేట్లు లేని వాహనాలు నడిపితే, వాటిని పోలీసులు తమ అదుపులోకి తీసుకుంటారు. ర్యాష్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, మితిమీరిన శబ్దాలు, ప్రమాదకరమైన డ్రైవింగ్, ట్రిపుల్, మల్టిపుల్ రైడింగ్ మొదలైన వాటిపై తగిన కేసులు బుక్ చేస్తారు. పబ్లిక్ రోడ్లపై డ్రైవింగ్ చేసేటప్పుడు ప్రజలు జాగ్రత్తగా, బాధ్యతతో, సురక్షితంగా ప్రయాణించాలి. మద్యం సేవించి వాహనం నడిపే ప్రతి ఒక్కరిపై మోటార్ వెహికల్స్ యాక్ట్, 1988లోని యూఎస్ 185 డిడి కేసులు బుక్ చేసి వారందరినీ నిర్ణీత సమయంలో కోర్టుకు హాజరుపరుస్తారు. ఎవరైనా రోడ్డు ప్రమాదానికి పాల్పడి, మరణానికి కారణమైతే ఐపీసీలోని యూ/ఎస్ 304 పార్ట్ సెక్షన్ కింద క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేసి జైలుకు పంపిస్తారు.

### బార్, పబ్, క్లబ్‌లకు సూచనలు..

బార్, పబ్, క్లబ్‌లు తమ ప్రాంగణంలో మద్యం సేవించిన కస్టమర్లను వాహనాలు నడపడానికి అనుమతిస్తే నేరాన్ని ప్రోత్సహించినందుకు సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకుంటారు. కస్టమర్లు తాగి వాహనాలు నడపడం వల్ల జరిగే దుష్పరిణామాలపై కచ్చితంగా అవగాహన కల్పించాలి. మద్యం సేవించిన వారు వాహనాలు నడపలేని పరిస్థితిలో ప్రయాణానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. మద్యం తాగిన వ్యక్తులు తమ ప్రాంగణంలో వాహనం నడపకుండా ఆపాలి. కార్యక్రమాలు చాలా శాంతియుతంగా జరిగేలా ఈవెంట్ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. మైనర్లను అనుమతించ వద్దు. సందర్శకుల చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డుల కాపీని సేకరించడం తప్పనిసరి.

### న్యూఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



2023 సంవత్సర వీడ్కోలు పలికి న్యూఇయర్ వేడుకలను జిల్లా ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినట్లు రుజువైతే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ర్యాస్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, సరైన పత్రాలు చూపించకున్నా ఆ వాహనాలను సీజ్ చేయడంతో పాటు డ్రైవర్, అందులో ఉన్న వారు మద్యం సేవిస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం. వేడుకల్లో రోడ్లపైకి వచ్చే వారు నిబంధనలు పాటించాలి. అదేవిధంగా రిసార్ట్, పబ్స్, పార్టీలు నిర్వంచే నిర్వాహకులు కచ్చితంగా చట్టపరమైన నియమాలు పాటించాలి.

– రాజేశ్‌చంద్ర, భువనగిరి డీసీపీ

# సైన్స్ ఫెయిర్‌కు సమాయత్తం

- ఆన్‌లైన్‌లో నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయం
- జనవరి రెండో వారంలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్
- జనవరి 19 నుంచి 25వరకు ఇన్‌స్పైర్ మానక్ అవార్డు ప్రదర్శనలు
- విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక అభివృద్ధిపై ప్రాజెక్టులకు అవకాశం
- వర్కింగ్ మోడల్స్‌కు ప్రాధాన్యం

**విద్యార్థుల్లోని శాస్త్ర, సాంకేతిక(విజ్ఞాన, గణితశాస్త్ర) నైపుణ్యాలు వెలికితీసి వారి ప్రతిభకు పదునుపెట్టే జిల్లా స్థాయి 'సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ మానక్ అవార్డు ప్రదర్శన ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. రెండు ప్రదర్శనలు ఆన్‌లైన్‌లో చేసేందుకు అవసరమైన అంశాలను సన్నద్ధం చేసేలా జిల్లా విద్యాశాఖ నిమగ్నమైంది. 'సమాజం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే ప్రధాన అంశంతో పాటు ఇన్‌స్పైర్ మానక్ అవార్డులు 2022-23కు ఎంపికైన 143 ప్రాజెక్టులతో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. వీటికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రదర్శనకు సూచించిన అంశాల్లో వర్కింగ్ మెడల్స్‌కు ప్రాధాన్యం కల్పించనున్నట్లు తెలిపారు.**

– రామగిరి, డిసెంబర్ 30



జిల్లాస్థాయి 'సమాజం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే పేరుతో జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ వైజ్ఞానిక గణిత – పర్యావరణ ప్రదర్శన'ను రాష్ట్ర విద్యాశాఖ సూచనలతో ఆన్‌లైన్‌లో నిర్వహణకు జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. దీనిలో భాగంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శన, వీడియో పంపించాల్సి ఉంటుంది. జిల్లా స్థాయి ప్రదర్శనలో ఎంపికైన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

### ప్రాజెక్టుల ఎంట్రీలకు నమోదు ఇలా..

ప్రదర్శనలో పాల్గొనే పాఠశాలు, విద్యార్థులు, ఛాత్రోపాధ్యాయుల వివరాలను జనవరి 8లోగా జిల్లా విద్యాశాఖ జారీచేసే గూగుల్ ఫారం లింక్‌లో సమర్పించాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల తయారీలో ఆయా విద్యాసంస్థల గణిత, సైన్స్ ఉపాధ్యాయులు గైడ్ టీచర్లుగా విద్యార్థులను ప్రోత్సహించి సంసిద్ధం చేసేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా ఇన్‌స్పైర్ అవార్డులు 2022–23కు ఎంపికైన 143 ప్రాజెక్టుల వివరాలను e–DLEPCలో జనవరి 18లోగా ప్రాజెక్టు ప్రదర్శన వీడియో, ఇతర వివరాలను 'ఇన్‌స్పైర్ మనక్ కాంపిటేషన్ యాప్‌లో నమోదు చేయాలి. వీరికి జనవరి 19నుంచి 25వరకు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ జూమ్ ద్వారా జిల్లాల వారీగా ప్రదర్శన నిర్వహిస్తారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి నంబర్ 9848578845ను సంప్రదించాలని కోరారు.

### ఉత్తమ ప్రాజెక్టులను ప్రోత్సహించాలి



జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్, ఇన్‌స్పైర్ మనక్ 2022–23 అవార్డుల ప్రదర్శన ఈ పర్యాయం ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నాం. దీనికి సంబంధించిన పూర్తి షెడ్యూల్ వెల్లడించాం. జిల్లావ్యాప్తంగా అన్ని యాజమన్యాల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో 6నుంచి 10తరగతి చదివే విద్యార్థులచే ప్రాజెక్టులు తయారుచేసి ఆన్‌లైన్‌లో ప్రదర్శన చేసేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సైన్స్, గణిత ఉపాధ్యాయులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అధిక ప్రాజెక్టులు వచ్చేలా చూడాలి. జిల్లా విద్యార్థులు ఆ ప్రాజెక్టులతో రాష్ట్ర, జాతీయ స్థాయికి వెళ్లి జిల్లా ఖ్యాతిని చాటేలా చూడాలి.

– బి.భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

